నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, సోమవారం 6 జనవరి 2025 | SURYAPET

నేడు మండల కేంద్రాల్లో ధర్నాలు

- రైతు భరోసాపై ప్రభుత్వం మోసం పట్ల బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసనలు
- బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

సూర్యాపేట, జనవరి 5 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసాను రూ.15వేలు కాకుండా రూ.12వేలు మాత్రమే ఇస్తానని మోసం చేయడం పట్ల సోమవారం జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో రైతులతో కలిసి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున ధర్నాలు చేపట్టాలని ఆ పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ ఆదివారం ఆయన ఒక ప్రకటనలో పిలుపు నిచ్చారు. రైతులకు అన్నీ చేస్తామని చెప్పి అడుగడుగునా మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆగ్రహావేశాలకు పతనం కావడం ఖాయమని పేర్కొన్నారు. రైతుల పక్షాన ఉండి వారికి ఏ ఆపద వచ్చినా వస్తానని నమ్మబలికిన రాహుల్‌గాంధీ, వరంగల్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. నేడు చేపట్ట బోయే ధర్నాలకు ప్రభుత్వానికి కనువిప్పు కలుగాలని, ఆ దిశగా పెద్దఎత్తున ధర్నాలు చేపట్టాలని కోరారు.

రూ.550 కోట్ల రైతు భరోసాకు ఎగనామం

చెప్పింది రూ.7,500.. ఇచ్చేది రూ.6,000

- పెట్టుబడి సాయం కుదింపునకు సర్కార్ నిర్ణయం
- రూ.7,500 చొప్పున రైతులకు చేరాల్సిన నగదు రూ.1,950 కోట్లు
- ప్రభుత్వ నిర్ణయంతో కోట్లల్లో రైతులకు నష్టం
- కేసీఆర్ హయాంలో రూ.5వేల చొప్పున రూ.1,250 కోట్ల పంపిణీ
- సాగు పేరుతో భూముల కుదింపుపైనా కొనసాగుతున్న కసరత్తు
- మరింతగా తగ్గనున్న లబ్ధిదారుల సంఖ్య
- ప్రభుత్వ మోసంపై రైతన్నల మండిపాటు

అధికారం కోసం ఏదేదో చెప్పేస్తాం..అంత మాత్రాన చెప్పినవన్నీ చేసేయ్యలా ఏంటీ.. అన్నట్లుగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ధోరణి ఉంది. తాజాగా రైతు భరోసా పథకానికి టోకరా వేశారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో తాము గద్దెనెక్కితే ఎకరాకు ఏడాదికి రూ.15,000 పెట్టుబడి సాయం ఇస్తామని చెప్పారు. అది కూడా గత యాసంగి నుంచే అని ఢంకా బజాయించి చెప్పారు. కానీ యాసంగిలో మాజీ సీఎం కేసీఆర్ సిద్ధం చేసిన డబ్బునే అదే రూ.5,000 చొప్పున ఇస్తూ మమ అనిపించారు. ఇక వానకాలం నుంచి ఇస్తామని చెప్పి అసలుకే ఎసరుపెట్టారు. దీంతో రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుండడంతో ప్రస్తుత యాసంగి నుంచి ఎకరాకు రూ.7,5000 ఇస్తామని చెప్తూ వచ్చారు. తీరా శనివారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో రూ.6వేలు మాత్రమే ఇవ్వగల మంటూ మడమ తిప్పారు. దీంతో ఒక్కసారిగా రైతాంగం హతాశు లైన పరిస్థితి. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతులు సుమారుగా రూ.550కోట్ల పెట్టుబడి సాయాన్ని కోల్పోను న్నారు. వాస్తవంగా ఎన్నికల హామీ ప్రకారం ఎకరాకు రూ.7,500 ఇస్తే ఉమ్మడి జిల్లా రైతులకు కనీసం రూ.1,950 కోట్లు దక్కాలి. కానీ ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయం వల్ల రూ.1,400 కోట్లకు కూడా గ్యారెంటీ లేకుండా పోయింది. ఇంకా సాగు భూములా? కాదా? అంటూ తేల్చేందుకు సర్వే రూపంలో కత్తి వేలాడుతూనే ఉంది. దీని ద్వారాను లబ్ధిదారుల సంఖ్య మరింత తగ్గిపోనుంది. ఒడ్డు చేరాక బోడి మల్లయ్య అన్నట్లుగా ప్రభుత్వ వ్యవహరిస్తుండడంతో రైతులు తీవ్రంగామండిపడుతున్నారు.

– నల్లగొండ ప్రతినిధి, జనవరి 5 (నమస్తే తెలంగాణ)

కోతల కాంగ్రెస్ సర్కార్

ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ సర్కార్ ప్రతి పథకంలో కోతలకే ప్రాధాన్యతనిస్తుంది. కేసీఆర్ సర్కార్ అమలు చేసిన పథ కాల కంటే అదనంగా ఇస్తామని చెప్పి ఇప్పుడు ఎలా కోతలు పెట్టా లన్న ఏకైక లక్ష్యంగా ముందుకు సాగుతున్నది. ఎన్నికల్లో రుణం తీసుకున్న ప్రతి రైతుకు రెండు లక్షల రుణమాఫీ అని గొప్పగా చెప్పారు. తీరా అమల్లోకి వచ్చే సరికి కుటుంబంలో ఒక్కరికే.. అది కూడా రెండు లక్షల వరకే అని కోతలు పెట్టింది. దీంతో గత ఆరు నెలల నుంచి మాఫీ కోసం ఇంకా ఉమ్మడి జిల్లాలో రైతులు 40శాతం మంది ఎదురు చూస్తున్నారు. ఇంకా రెండున్నర లక్షల మందికి రుణమాఫీ కావాల్సి ఉన్నది. ఇక తాజాగా రైతు భరోసా కుదింపుతో రైతులను మరోసారి మోసం చేస్తున్నారు. అధికారం కోసం అడ్డగోలు హామీలు ఇచ్చి గద్దెనెక్కాక కోతలు పెడుతూ మోసం చేస్తున్నారంటూ రైతులు, రైతు సంఘాల నేతలు తీవ్రంగా మండిపడుతున్నారు.

ఎన్నికల్లో హామీ ఇవ్వకుం డానే వ్యవసాయాన్ని పండు గలా మార్చాలని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుబంధు పథకానికి రూపకల్పన చేశారు. 2018 వానకాలం సీజన్ నుంచి రైతుబంధు పథకానికి శ్రీకారం చుట్టిన కేసీ ఆర్... ఎప్పుడూ మాట తప్పకుండా వరు సగా మొత్తం 11 సీజన్లల్లో క్రమం తప్ప కుండా రైతుబంధు ఇస్తూ వచ్చారు. 2018 వానకాలం సీజన్ నుంచి మొదలుపెట్టి తొలి సీజన్‌లో రూ.4 వేలు, తర్వాత సీజన్ నుంచి ఎకరానికి రూ.5వేల చొప్పున ఏడాదిలో రెండు సీజన్లకు కలిపి రూ.10వేల సాయాన్ని అందిస్తూ వచ్చారు. అప్పటి నుంచి 2023 వానకాలం సీజన్ వరకు ఎన్నడూ రైతుబంధు ఆగ లేదు. మొత్తం వరుసగా 11 సార్లు రైతుబంధు ద్వారా ఉమ్మడి జిల్లా రైతులకు రూ.11,700 కోట్ల నగ దును కేసీఆర్ సర్కార్ పంపిణీ చేయడం విశేషం. ఇన్ని కోట్ల రూపాయల్లో ఒక్క రూపాయి పక్కదారి పట్టకుండా ప్రతి పైసా నేరుగా రైతులకే చెందేలా అత్యంత పకడ్బం దీగా పథకాన్ని కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసింది. ఒక్క రూపాయి కూడా ఎవరికీ లంచం ఇవ్వకుండా నేరుగా రైతులకే చెందా యంటే నాటి ప్రభుత్వ చిత్తశుద్ధి తెలుస్తుంది.

రూ.11,700 కోట్లు ఇచ్చిన కేసీఆర్

రూ.550 కోట్లు కోత

తాము అధికారంలోకి వస్తే ఎకరాకు రూ.7500 చొప్పున రైతు భరోసా ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఈ విధంగా ఒక్కో సీజ న్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతులకు రూ.1950 కోట్ల వరకు పెట్టుబడి సాయంగా అందాల్సి ఉంది. గతంలో కేసీఆర్ సర్కార్ హయాంలో చివరి సారిగా 2023 వానకాలం సీజన్‌లో ఎక రాకు రూ.5వేల చొప్పున ఉమ్మడి జిల్లాలో 10.81 లక్షల మందికి రూ.1,250 కోట్లు అందజేశారు. అదే ఏడాది యాసంగి సీజన్ కోసం కూడా పెట్టుబడి సాయాన్ని సిద్ధం చేయగా అప్పుడు ఎన్నికల కోడ్‌లో కాంగ్రెస్ అడ్డుపడింది. ఆ సీజన్‌లో 11లక్షల మంది రైతులకు రూ.1,300కోట్లు సిద్ధం చేశారు. ఈ ప్రకారం చూస్తే కాంగ్రెస్ హామీ మేరకు ఎకరాకు రూ.7,500 ఇస్తే ప్రస్తుత సీజన్‌లో అద నంగా 50శాతం లబ్ధితో మొత్తం రూ.1950 కోట్లు అందాలి. కానీ దాన్ని రూ.6వేలకు కోత పెట్టడం వల్ల రూ.1,400 కోట్లు కూడా దాటే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో ఉమ్మడి జిల్లా రైతులు సుమారు రూ.550 కోట్లు నష్టపోనున్నారు. ఇక పోతే ఇప్పటికే వానకాలం సీజన్‌లో రైతులు రూ.1,950 కోట్ల పెట్టుబడి సాయాన్ని కోల్పోయిన విషయం తెలిసిందే. తాజాగా తగ్గింపు వల్ల సుమారు రూ.2,500 కోట్ల పెట్టుబడి సాయానికి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు టోకరా వేసినట్లేనని రైతు సంఘాల నేతలు స్పష్టం చేస్తున్నారు. ఇంకా ఇది కాకుండా సాగు భూములా? కాదా? అని తేల్చేందుకు మరోవైపు సర్వే కూడా చేస్తున్నారు. దీని వల్ల రైతులకు చెందాల్సిన పెట్టుబడి సాయం మరింత తగ్గిపోనుంది. ఇక కౌలు రైతులకు కూడా పెట్టుబడి సాయం ఇస్తామని చెప్పిన మాటను ప్రస్తుతం అటకెక్కించారు.

కాంగ్రెస్‌కు రైతుల ఉసురు తగులుద్ది

ఎన్నికల హామీలో రైతు భరోసా ఏడాదికి 15 వేల రూపాయలు ఇస్తామని కాంగ్రెస్ నాయకులు చెప్పి ఏడాదిగా కాలం గడిపి మొత్తం రైతుల భరోసా ఎగ్గొ ట్టారు. ఇప్పుడు 12 వేల రూపాయలే ఇస్తామని మాట మార్చి రైతులను మోసం చేస్తున్నారు. రేవం త్‌కు రైతులు ఉసురు తగులుద్ది. ఆసలు రైతు భరోసా ఇస్తారన్న నమ్మకం పోయింది. రెండు కార్లకు పెట్టు బడి సాయం ఆందక అప్పులు తెచ్చుకొని సాగు చేసినం. కాంగ్రెస్ ప్రజా పాలన అని అంటూ అన్ని వర్గాల ప్రజలను నట్టేట ముంచుతున్నది. గత ప్రభుత్వంలో కేసీఆర్ సకాలంలో రైతుబందు ఇవ్వడంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతులు సంతోషంగా ఉన్నారు.

- చిలుకల ఎల్లయ్య, రైతు, బుద్దారం, నల్లగొండ రూరల్

కొర్రీలతో కాలయాపన చేస్తున్న ప్రభుత్వం

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథ కాలు అందించడంలో విఫలమై కొర్రీలతో కాల యాపన చేస్తున్నది. షరతులతో కూడిన రైతు భరోసా ఇస్తామనడం రైతులను అవమానించ డమే. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైంది. రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ పాలనపై నమ్మకం పోయింది. రాష్ట్రంలోని రైతు భరోసా కోసం 23వేల కోట్ల రూపాయలు కావాల్సి ఉండగా కేవలం 7వేల కోట్ల నిధులు ఇవ్వడం సరికాదు. రేవంత్ సర్కారుకు తగిన గుణపాఠం ప్రజలు చెప్పడానికి సిద్ధం ఉన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పాలనను అసహ్యించుకుంటున్నారు.

-సయ్యద్ అబ్దుల్ నజీ, రైతు, లింగగిరి, హుజూర్‌నగర్ మండలం

హామీలను తుంగలో తొక్కింది

ఎన్నికల మ్యానిఫోస్టోలో రైతు భరోసా 15వేల రూపా యలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు కుదించి 12వేలు ఇవ్వను న్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రక టన చేయడం తీవ్ర అన్యాయం. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీ ఆర్ ఎలాంటి షరతులు లేకుండా రైతులకు సకాలంలో రైతుబంధు అందించి ఆదుకున్నడు. గత ప్రభుత్వ హయాంలో రైతుబంధు సాయం సకాలంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తీసుకున్నం. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కుతూ రైతు రుణమాఫీ, వానకాలం పంటలకు పెట్టుబడి సాయం ఇవ్వక మోసం చేసింది. ఇచ్చిన మాట ప్రకారం రైతు భరోసా కింద 15వేలు ఇవ్వాలి, లేకుంటే రైతులు ప్రభు త్వానికి తగిన బుద్ధి చెప్పడం ఖాయం.

-బెల్లి రవి, రైతు, లయిటిపాముల, కట్టంగూర్ మండలం

ఒక్క హామీ సక్రమంగా అమలు చేయలేదు

నేను కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తిని. కానీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏడాది పాలన చూసి బాధపడుతున్న. సిగ్గుతో తల దించుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. మొన్న ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీ సక్రమంగా అమలు చేయకపాయే. నాతోపాటు చాలా మంది రైతులకు రెండు లక్షల రుణమాఫీ కాలేదు. 2 లక్షల రూపాయలకుపైన ఉన్న పైసలు కట్టేమంటే నెలరోజుల క్రితం లక్షా 30 వేల రూపాయలు బ్యాంకులో వడ్డీ కట్టిన. ఇప్పటికీ నాకు రుణమాఫీ కాలేదు. ఎన్నికల ముందు ఎకరానికి 15వేల రైతు భరోసా ఇస్తానని చెప్పి ఇవాళ 12వేల రూపాయలే ఇస్తామని ముఖ్యమంత్రి చెబుతుంటే రైతులు మండిపడుతున్నరు. కాంగ్రెస్ పార్టీకి పోయేకాలం వచ్చింది. రేవంత్ పాలన చూసి కేసీఆర్‌కు ఓటేసినా బాగుండు అనిపిస్తుంది. ఇప్పుడు ఎన్నికలు పెడితే కేసీఆరే గెలుస్తడు. కేసీఆర్ ఉండంగ రైతులందరికీ మంచిగా రైతుబంధు ఇచ్చిండు. అందరికీ అన్ని పథకాలు, సౌకర్యాలు కల్పించిండు.

-గాలి చిన గోవిందరెడ్డి, రైతు, బట్టుగూడెం, పెద్దవూర మండలం

కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితి లేదు

ఎన్నికల ముందు రైతు భరోసా పథకం కింద ఎకరాకు పదిహేను వేల రూపాయలు ఇస్తామని చెప్పి, ఇప్పుడు పన్నెండు వేలే ఇస్తామనడం మోసం చేయడమే. గత ప్రభుత్వం ఇచ్చిన రైతుబంధు కన్నా అధికంగా రైతు భరోసా ద్వారా ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితి లేదు. అప్పులు చేసి వ్యవసాయానికి పెట్టు బడి పెట్టినం. మా లాంటి రైతులను మోసం చేస్తే తగిన గుణ పాఠం తప్పదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎకరాకు పదిహేను వేల రూపాయలు ఇచ్చి రైతులను ఆదుకోవాలి.

-కొప్ప శ్రీను, రైతు, గుంజలూరు, చివ్వెంల



సావిత్రిబాయి పూలే అవార్డులు ప్రదానం చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

దేశం గర్వించదగ్గ మహిళ సావిత్రి బాయి పూలే

- మహిళల కోసం ఆమె ఎన్నో పోరాటాలు చేశారు
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, జనవరి 5(నమస్తేతెలంగాణ) : దేశం గర్వించదగిన గొప్ప మహిళ సావిత్రి బాయి పూలే అని, ఆమె దేశంలోని ఎందరో మహిళలకు ఆదర్శంగా నిలిచారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. భారత దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే జయంతిని పురస్కరించుకొని తెలం గాణ మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్(టీఎం ఎస్‌టీఏ) సూర్యాపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆది వారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సావిత్రి బాయి పూలే అవార్డ్సు -2025 ప్రదానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎంపికైన ఉత్తమ మహిళా ఉపాధ్యాయు రాళ్లకు అవార్డులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళల చైతన్యంతోనే సమాజంలో పూర్తి స్థాయి అభివృద్ధి జరుగుతుంద న్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సావిత్రిబాయి అనేక పోరాటాలు చేశారన్నారు. మహిళలను విద్యావంతులను చేయాలని మహాత్మా జ్యోతిరావుపూలే గొప్ప ఆలోచనతో ముందుగా తన సతీమణినే చదివించి ఉపాధ్యా యురాలిని చేశాడని తెలిపారు. ఆయన మార్గం లోనే సావిత్రిబాయి ఎంతో మంది మహిళలను చైతన్యవంతుల్ని చేసిందని చెప్పారు. ఇంటిని చక్క దిద్దినట్టే, సమాజాన్ని చక్కదిద్దడంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, అటువంటి మహిళా ఉపా ధ్యాయురాళ్లను సత్కరించుకోవడం గొప్ప విషయ మన్నారు. ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టిన టీఎం ఎస్‌టీఏ బృందానికి ప్రత్యేక అభినందనలు తెలి పారు. టీఎంఎస్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు భూతం యాకమల్లు, మాజీ ఎమ్మెల్సీ రవీందర్, వేణుగోపా ల్‌రెడ్డి, చలమల్ల నర్సింహ, రాధాకృష్ణ, దామెర శ్రీనివాస్, సౌజన్య, గురుచరణ్, రవి, రమేశ్, మల్లయ్య, శ్రీను, సామ్రాజ్యలక్ష్మి, కార్తీక్, మానస వీణ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాతో కాంగ్రెస్ 420 నైజం బయటపడింది

ఏడాది కాలంలో ఆ పార్టీ అన్నింటా విఫలం : మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్

హాలియా, జనవరి 5 : రాష్ట్రంలో కాంగ్రెస్ నయవం చక పాలన సాగిస్తున్నదని, ఏడాది కాలంలో ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అన్నింటా విఫలం చెందిందని నాగార్జున సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ ఆదివారం ఒక ప్రకట నలో తెలిపారు. గత శాసన సభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫె స్టోలో 420 హామీలు ఇచ్చిందని, కానీ ఏడాది పూర్తయినా 420 కాదు కదా 6 గ్యారెంటీలను కూడా పూర్తిగా అమలు చేయలేదని విమర్శిం చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే గతేడాది డిసెంబర్ 9న రైతు భరోసా ఎక రానికి 15వేల రూపాయల ఇస్తా మని చెప్పి, ఏడాది కాలం గడిపి ఇప్పుడు 12 వేలు ఇస్తామని చెప్పడం మోసం చేయడమే. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వ లేదని, రైతు బంధు ఇవ్వలేదని, రుణమాఫీ పూర్తి స్థాయిలో చేయ లేదని, ఆసరా పింఛన్ల పెంపు లేదని, కల్యాణలక్ష్మిపాటు తులం బంగారం ఇవ్వడం లేదని తెలి పారు. రైతు భరోసా ప్రకటనతో కాంగ్రెస్ పార్టీ మోసం మరోసారి రుజువైందని పేర్కొన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు.

విజేతలకు షీల్డులు ప్రదానం చేస్తున్న చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు గండూరి కృపాకర్

ఉమ్మడి నల్లగొండ జిల్లా చెస్ విజేతలకు బహుమతులు

సూర్యాపేట టౌన్, జనవరి 5 : సూర్యాపేట జిల్లా కేంద్రం టీటీడీ కల్యాణ మండపంలో ఆది వారం నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా అండర్-7, 9, 11, 15 చెస్ పోటీలు విజయవం తమయ్యాయి. జిల్లా చెస్ అసోసియేషన్ అధ్య క్షుడు, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గండూరి కృపా కర్ విజేతలకు షీల్డులు, సర్టిఫికెట్స్‌ను ప్రదానం చేసి మాట్లాడారు. చెస్ క్రీడాకారుల్లో ప్రతిభను వెలి కితీసేందుకు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆశీస్సులతో గత పదేళ్లుగా జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 100 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొనగా, వివిధ విభా గాల్లో 24 మంది విజేతలుగా నిలిచారని వెల్లడిం చారు. ఈ కార్యక్రమంలో జిల్లా చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎల్.సతీశ్‌కుమార్, ఉపాధ్య క్షుడు సాయికుమార్, సహాయ కార్యదర్శి లింగా రెడ్డి, కోశాధికారి వెంకటమురళి, కార్యవర్గ సభ్యులు జానయ్య, రాజేశ్, నరసింహారావు, శాంతికుమార్, భిక్షం, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో మోసాలు

- సైబర్ నేరాల నుంచి అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నీలగిరి జనవరి 5 : స్టాక్ మార్కె ట్‌లో ఇన్‌వెస్ట్‌మెంట్, పెట్టుబడి పేరుతో పలు యాప్‌లను డౌన్‌లోడ్ చేయించి సైబర్ నేరగాళ్లు మోసా లకు పాల్పడుతున్నారని, ఇలాంటి వాటిపై జాగ్రత్తగా ఉండాలని నల్ల గొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆది వారం ఒక ప్రకటనలో సూచిం చారు. ఇలాంటి సంఘటన నల్ల గొండ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరి ధిలో జరిగిందని తెలిపారు. ఒక బాధితుడితో సైబర్ నేరగాళ్లు సుమారు రూ.2 కోట్లు స్టాక్ మార్కెట్లో ఇన్ వెస్ట్‌మెంట్ చేయించి, నకిలీ అధిక లాభాన్ని చూపించి మోసం చేశారని పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్లు సోషల్ మీడియాను ఆసరాగా చేసుకొని చెప్పే మాటలు, పంపే మెసేజ్‌లు నమ్మి మోసపోవద్దని తెలిపారు. ఒక వేళ సంఘటన జరిగిన వెంటనే సైబర్ నేరాలపై 1930 నంబర్‌కు కాల్ చేయడం లేదా https://www. cyber crime.gov.in/ వెబ్‌సైట్‌లో నమోదు చేయడం లేదా దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు.

నల్లచౌట చెరువు నుంచి వృథాగా నీటి విడుదల

పక్షం రోజులుగా పోతున్నా పట్టించుకోని నీటిపారుదల అధికారులు

- శిఖం భూముల ఆక్రమణదారులే కారణం
- ఇలాగైతై వేసవిలో తాగు, సాగునీటికి ఇబ్బందులే అంటున్న జనం

నిడమనూరు, జనవరి 5 : మండల కేంద్రంలోని నల్లచౌట చెరువు నీటిని శిఖం ఆక్రమణదారులు అక్రమంగా దిగువకు విడుదల చేస్తున్నారు. శిఖం భూములను అడ్డా అదుపు లేకుండా పదుల సంఖ్యలో ఆక్రమించి సాగు చేస్తున్న అక్రమార్కులు ఆ భూముల్లోని పంటల మునక సాకుతో అడ్డగోలుగా రెచ్చిపోతున్నారు. ఇటీవల కురిసిన తుఫాను ప్రభావంతో ఎగువన గొలుసు కట్టు చెరువుల నుంచి పెద్ద ఎత్తున నిడ మనూరు చెరువులోకి నీరు చేరి పూర్తి స్థాయిలో నిండింది. ఈ కారణంగా శిఖంలో సాగు చేస్తున్న పంటలు నీట మునిగాయి. దీంతో ఆక్రమణ దారులు చెరువు తూము షట్టర్లు ఎత్తి గత పక్షం రోజులుగా చెరువు నీటిని అక్రమంగా దిగువకు వదులుతుండటంతో చెరువు కళా విహీనమవుతున్నది. చెరువులో నీరు ఖాళీ అయితే రానున్న వేసవిలో తీవ్ర ఇబ్బందులు తలెత్తే ప్రమాదం లేక పోలేదు. చెరువు నీటిని అక్రమంగా విడుదల చేసిన తీరు, ఆక్రమణలపై గతంలో పలువురు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడు లేడు.

తూము షట్టర్లు ఎత్తడంతో దిగువకు వృథాగా పోతున్న నీరు

నిద్ర మత్తులో నీటిపారుదల శాఖ...

గతంలో శిఖం ఆక్రమణలపై నమస్తే తెలంగాణ కథనం నేపథ్యంలో ఉన్నతా ధికారులు సర్వేకు ఆదేశించారు. ఆక్రమ ణదారులకు నోటీసులిచ్చిన రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు చెరు వులో నీరుందన్న సాకును చూపి విచా రణను తూతూ మంత్రంగా నిర్వహించి అటకెక్కించారు. 310 ఎకరాల చెరువు శిఖం భూముల్లో 100 ఎకరాల మేర కబ్జాకు గురైనట్లు స్థానికులు పేర్కొంటు న్నారు. చెరువు వెంట శిఖం ఆక్రమణల నేపథ్యంలో తూము సమీపంలోకి వ్యవ సాయ సాగు పంటలు రావడంతో చెరువు నిండిన తరుణంలో చెరువు నీరు వరదల రూపంలో ఇండ్లలోకి చేరు తున్న పరిస్థితి ఏటా చోటు చేసుకుంటు న్నది. నివారణా చర్యలు చేపట్టాల్సిన నీటిపారుదల శాఖ చోద్యం చూస్తుండ టంతో చెరువు రూపు రేఖలు మారుతున్నాయి.

ఫిర్యాదు చేసినా చర్యలు కరువు

నిడమ నూరు, సోమోరి గూడెం, ముప్పారం చెరువు శిఖం ఆక్రమణలపై పలుమార్లు అధికారు లకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకో లేదు. ఆయకట్టు రైతులు, మత్స్యకార్మి కులు చెరువుపై ఆధారపడుతున్నా శిఖం ఆక్రమణదారులు పంటల మునక పేరుతో అక్రమంగా నీటిని దిగువకు వదులుతు న్నారు. దీనిపై అధికారులకు వివరించినా స్పందన లేదు. చెరువులో నీరు కొంత మేర ఖాళీ అయ్యింది. ఇలాగే ఉంటే రానున్న వేసవి లో తాగు, సాగు నీటి అవ సరాలకు ఇబ్బందే.

-కోట్ల సైదులు, చైర్మన్ ముప్పారం, మత్స్యపారిశ్రామిక సహకార సంఘం